క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దామెర : నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ గుర్రం రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా సబ్ స్టేషన్ పరిధిలోని దామెర, ల్యాదెళ్ల, వెంకటాపూర్, సింగరాజుపల్లి, ఒగ్లాపూర్, తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వేలేరులో..

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల, వేలేరు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో 33 కేవీలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు అన్ని 11 కేవీ ఫీడర్ లైన్‌ల త్రీఫేజ్ సరాఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎస్సైగా పస్తం శ్రీనివాస్



ఐనవోలు : ఎస్సైగా పస్తం శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ విధులు నిర్వర్తించిన గైకడి అనిల్‌కుమార్ ఇటీవల బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. కాగా శ్రీనివాస్ గతంలో ఇదే ఎస్‌హెచ్ఓలో ప్రొబేషనరీ ఎస్సైగా విధులు నిర్వహించారు. కాగా పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు కిట్ల అందజేత

ఐనవోలు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు ప్రత్యేక అవసరాల కిట్లను గురువారం జీసీడీఓ సునీత అందించారు. వరంగల్ ఎంజీఎంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం డాక్టర్ల సూచన మేరకు ముగ్గురు విద్యార్థులకు ఎంఆర్ బ్యాగ్స్, రోలెటర్, క్యాలిపర్స్ కిట్లు అందించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీలు



దామెర : మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సమాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ శారద శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2023–24 సంవత్సరానికి సంబంధించి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పనుల నాల్గో విడత సామాజిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ నెల 16న మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ కొమురయ్య, డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



నడికూడ : మండలంలోని నార్లాపూర్ గ్రామంలోని కోమటికుంట కట్టకు వెళ్లే దారిలో ఉన్న ముళ్లపొదలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి రాజయ్య ఆధ్వర్యంలో తొలగించారు. బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న, నాయకులు రవీందర్, సాంబయ్య, వీరేశలింగం, అశోక్, శివ, భోగి మల్లేశ్, సుదర్శన్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



దామెర : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిల్లా రమణారెడ్డిని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. రమణారెడ్డి తండ్రి మధుసూదన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రేవూరి శుక్రవారం పరామర్శించారు. మధుసూదన్‌రెడ్డి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మధుసూదన్‌రెడ్డి ఆత్మ శాంతించాలని మౌనం పాటించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మండల నాయకులు ప్రవీణ్, రాజస్వామి, వేణు, కొమ్మాలు, రమేశ్ ఉన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామానికి చెందిన బండి నర్సమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బరిగెల సదానందం శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 3వేల ఆర్థికసాయం అందజేశారు.

నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- రెండేళ్లు గడుస్తున్నా పూర్తికాని దారి
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కంకర తేలిన మల్లక్కపేట వెళ్లే రోడ్డు

నడికూడ : ఆ గ్రామం రాష్ట్ర స్థాయి రాజకీయ నాయకులకు పుట్టినిల్లు. కానీ అభివృద్ధికి ఆమడదూరంలో కొట్టుమిట్టులాడుతోంది. కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండంలోని నర్సక్కపల్లి గ్రామానికి సుమారు రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారి నుంచి మల్లక్కపేట రోడ్డు వరకు రోడ్డు నిర్మాణ పనులు రెండేళ్ల క్రితం ప్రారంభించారు. పనులు సగభాగానికి చేరుకోగా గ్రామనికి చెందిన కొందరు రోడ్డు విస్తరణ వలన తమకు నష్టం జరుగుతుందని ఆరోపిస్తూ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దీంతో రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అప్పటి నుంచి వాహనదారులకు, గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కంకర తెలిన రోడ్డుపై మూగజీవాలు నడువలేక తల్లడిళ్లుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చే వాహనదారులు రాత్రివేళల్లో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కొందరు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురియైనా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



శాయంపేట : సైడ్ డ్రెయినేజీ శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

శాయంపేట : వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ అన్నారు. మండల కేంద్రంలోని సైడ్ డ్రెయినేజీ, రోడ్డుకిరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను శుక్రవారం తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులు ప్రబటకుండా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వైశాలి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఎస్ఓ స్రవంతి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాల పరిసర ప్రాంతాల్లో గల పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ కూమారస్వామి పాల్గొన్నారు.

20 లీటర్ల నాటు సారా స్వాధీనం



పరకాల : మండలంలోని నాగారం గ్రామంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 20 లీటర్ల నాటుసారా పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. ఇద్దరు నిందితులు అజ్మీరా సుమన్, అజ్మీరా రజితను అరెస్టు చేసి వారి నుంచి ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై సులోచన, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి, కానిస్టేబుళ్లు సమ్మయ్య, విజయ్‌కుమార్, దిలీప్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లికి బోనాలు

నర్సంపేట : పట్టణంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లి బోనాల జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కూడా బోనాలకు హాజరై ప్రత్యేక పూజ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దుగ్గొండి : సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మల్లంపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లోని రికార్డులను పరిశీలించారు. బాలింతలు, గర్భిణుల నమోదు, వర్షాకాలంలో గ్రామాల వారీగా తీసుకుంటున్న చర్యలు, పారిశుద్ధ్య వివరాలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతీఒక్కరు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి కిరణ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగట్టులో బీఆర్ఎస్ నాయకుడు కోరుకొప్పుల సదానందం తండ్రి కోరుకొప్పుల సదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆయన శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోల్ల నరేష్, మాజీ మార్కెట్ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, దామెర మాజీ వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, మాజీ కో ఆప్షన్ సభ్యుడు అంకూస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలుస్తా : సిరికొండ



మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

శాయంపేట : వివిధ కారణాలతో మృతిచెందిన బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తానని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన జీడిమడ్ల ప్రమీల, పిట్టల శ్రీనివాస్, సాధనపల్లికి చెందిన మిట్టపల్లి చిన్నరమేశ్, రాజుపల్లికి చెందిన మలహల్‌రావు ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన గిద్దమారి రాజు, సంగాల థామస్, బొమ్మకంటి శాంతికుమార్, సాధనపల్లికి చెందిన ముత్యం రాజు అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని కొంత ఆర్థికసాయం అందించారు. బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు రమేశ్, గణేశ్, రాకేశ్, విజయ్ ఉన్నారు.

నగదు బదిలీతో ముదిరాజ్‌లకు లబ్ధి

రాయపర్తి (వర్ధన్నపేట) : చేపపిల్లల పంపిణీకి బదులు నగదు బదిలీ చేస్తే ముదిరాజ్ వృత్తిదారులకు లబ్ధి చేకూరుతుందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న తలపెట్టిన తహసీల్దార్ కార్యాలయ ముట్టడి కార్యక్రమ పోస్టర్లను వర్ధన్నపేటలో ఆయన గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని, చెరువులతోపాటు కుంటలపై ముదిరాజ్ కులస్తులకు సంపూర్ణ హక్కులు కల్పించాలని, త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్ కుల నాయకులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య, జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరోటి సదానందం, నాయకులు కోటి, చెవ్వు కాశీనాథం, అల్లాడి నర్సయ్య, గుండా రాకేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

'గ్రీన్‌ఫీల్డ్' సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

దామెర : గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే భూ నిర్వాసితుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మిదేవి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూనిర్వాసితులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రైతులు తమకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతుల న్యాయ పరమైన డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. తమ భూమి పత్రాలను తహసీల్దార్‌కు పసరగొండకు చెందిన రైతులు అందించారు. ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

17న బీరన్న బోనాలు నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

ఖిలా వరంగల్: ఈనెల 17న కరీమాబాద్ బీరన్న గుడిలో కురుమ కుల సంఘం ఆధ్వర్యంలో బీరన్న బోనాలను నిర్వహించనున్నట్లు కురుమ కుల సంఘం, బీరన్న స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కోరె సదానందం తెలిపారు. ఈమేరకు వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని బీరన్న గుడి ఆవరణలో గుడి కమిటీ ప్రధాన కార్యదర్శి కోరె నాగరాజు, కోశాధికారి నరిగె లక్ష్మణ్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ ఏకాదశి రోజున బీరన్న దేవుడికి కురుమ కులస్తులు నైవేద్యంగా బోనాన్ని సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. 17న మహిళలు ఉపవాస దీక్షతో బోనాన్ని సిద్ధం చేసి సాయంత్రం సామూహికంగా తరలిరావాలని కోరారు. గుడి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో దయ్యాల కృష్ణ, దయ్యాల సుధాకర్, మల్లేశం, కోరె కుమారస్వామి, బందారి రాజేశ్వర్, కొమురెల్లి, నవీన్, సదానందం, క్రాంతికుమార్, రాజు, తిరుపతి, శ్రీనివాస్, శంకర్, వేణు, శ్రీనివాస్, చిన్న రవి, అరవింద్, రాజు, సతీష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని పోతరాజుపల్లిలో గీసుకొండ పీఏసీఎస్ ద్వారా రూ.5 లక్షల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో చేపట్టిన అభివృద్ధి పనులను సొసైటీ చైర్మన్ రడం శ్రీధర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సొసైటీ భూమి అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక నిధులతో ప్రహరీ నిర్మిస్తామని చెప్పారు. టీఎస్ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సహకారంతో సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. సొసైటీ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పాలెపాక శ్రీనివాస్, సొసైటీ వైస్‌చైర్మన్ నరేందర్, కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, డైరెక్టర్లు ప్రభాకర్, యాదగిరి, సురేశ్, మాణిక్యం, మాజీ సర్పంచ్ పుస్కుల వీరమల్లు, నాయకులు మంద బాబూరావు, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

'కలప ఆన్‌లైన్ పర్మిట్'ను నిలిపివేయాలి



రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సామిల్ అధ్యక్షుడు, సభ్యులు

కమలాపూర్ : కలప, కటింగ్ సైజుల కోసం ఆన్‌లైన్ ద్వారా నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ సిస్టం (ఎన్‌టీపీఎస్) నిలిపివేయాలని సామిల్, టింబర్ మర్చంట్స్ అసోసియేషన్ వరంగల్, హనుమకొండ, కమలాపూర్ మండలాల అధ్యక్షులు వి.సతీష్, జి.చంద్రమౌళి, దాసి శంకరయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం తమ సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లాలోని కర్ర కోత మిల్లరు, అనుబంధ పరిశ్రమలు కలప ఆధారిత పరిశ్రమల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయని తెలిపారు. పర్యావరణం, పర్యావరణ పరిరక్షణలో మొదటి స్థానంలో ఉన్నాయన్నారు. సులభతరమైన వ్యాపారాన్ని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ అటవీ శాఖ ఫారం–2 ద్వారా రవాణా అనుమతుల జారీని ఆన్‌లైన్‌లో ప్రారంభించిందని, అది గజిబిజిగా, అసాధ్యంగా ఉందని మంత్రికి సురేఖకు తెలిపారు. జీఎస్టీ చట్టం ప్రకారం ఇ–వే బిల్లులు, ఇ–ఇన్‌వాయిస్‌లను జారీ చేసేలా ఉంటే తాము ఎన్‌టీపీఎస్ అమలు చేస్తామన్నారు. భారతదేశం అంతటా అమలు చేసే వరకు మాన్యువల్ ఫారం–2 ద్వారా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామిల్, టింబర్ మర్చంట్స్ అసోసియేషన్ వరంగల్, హనుమకొండ కార్యదర్శులు కనకాచారి, సుదర్శన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న హరిత

ఐనవోలు : సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవలను బాధిత మహిళలు వినియోగించుకోవాలని కేస్ వర్కర్ హరిత సూచించారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో వీఓ సభ్యుల సమక్షంలో శుక్రవారం సఖి వన్ స్టాప్ సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేస్ వర్కర్లు హరిత, వినీల మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ కొనసాగుతుందన్నారు. మహిళలు చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. విడిపోయే భార్యాభర్తలకు సఖి సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వరకట్న వేదింపులు, లైంగిక వేదింపులు, గర్భవిచ్ఛిత్తి తదితరాల వేదింపులకు పరిష్కారాలు లభిస్తాయన్నారు. మహిళలకు, బాలికలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా సఖి కేంద్రం పని చేస్తుందన్నారు. బాధితులు 0870–245112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు.

'మనకోసం మనం'ను విజయవంతం చేయాలి

- మున్సిపల్ కమిషనర్ నరసింహ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నర్సింహ

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనకోసం మనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థులను ఉద్దేశించి శుక్రవారం ఆయన మాట్లాడారు. డెంగీ జ్వరానికి ప్రధాన కారణం దోమలే అన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మనకోసం మనం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు 10 నిమిషాల పాటు స్వచ్ఛందంగా ఇంటి పరిసరాలలో నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణవాసులకు అవగాహన కల్పించి వాటర్ కూలర్లలో, కొబ్బరి బొండాల్లో నీటిని, నీటి తొట్టిలోని నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి



కోగిల్వాయిలో బాలిక ఎత్తు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ రాణి

దామెర : సమతుల్య ఆహారంతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి అన్నారు. మండల కేంద్రంతో పాటు ల్యాదెళ్ల, సింగరాజుపల్లి, వెంకటాపూర్, పులుకుర్తి, కోగిల్వాయిలో శుక్రవారం గ్రోత్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా 0–5 సంవత్సరాలు కలిగిన 860 మంది పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పిల్లల వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండే విధంగా ఆహారం అందించాలని తల్లులకు, అంగన్‌వాడీలకు సూచించారు. పోషణ లోపం లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. సంపూర్ణ పోషక పదార్థాలు పుష్కలంగా ఉండే ఆహారాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు శోభ, వాణి, జ్యోతి, ఫాతిమా, ఆశ కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజం



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, గ్రామస్తులు

శాయంపేట : ఉద్యోగులకు బదిలీ సహజమని మండలంలోని గట్లకానిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమార్ అన్నారు. ఇది వరకు పాఠశాలలో బోధించిన ఉపాధ్యాయులు టి.భాస్కర్, వి వసంతలత, బి.కైలాస్, జె.విజయ్‌కుమార్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమని అన్నారు. పనిచేసిన చోట మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని కోరారు. నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించి మంచి పేరు, ప్రఖ్యాతలు సంపాదించాలని ఆశించారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత వహించి మంచి మార్కులు సాధించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయ, మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు రాజేశ్, రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.